క్లుప్తంగా

వైభవంగా లక్ష్మీనారాయణుని కల్యాణ రథోత్సవం



ద్రాక్షారామలో లక్ష్మీనారాయణుని కల్యాణ రథోత్సవం

రామచంద్రపురం రూరల్: దక్షిణ కాశీ ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి పాలక క్షేత్ర పరిధిలోని 12 గుండాలలో ఒకటైన బ్రహ్మగుండం వద్ద వేంచేసి ఉన్న భీమేశ్వరాలయ క్షేత్రపాలకుడు శ్రీలక్ష్మీ సమేత నారాయణ స్వామి దివ్య కల్యాణం మంగళవారం రాత్రి కన్నుల పండుగగా నిర్వహించారు. అంగర ప్రభాకరాచార్యులు, బృందావనం సత్యనారాయణాచార్యులు, అంగర లక్ష్మీనారాయణాచార్యులు బ్రహ్మత్వంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. బుధవారం స్వామి కల్యాణ రథోత్సవం వైభవంగా నిర్వహించారు. గ్రామ పురవీధుల నుంచి భీమేశ్వరాలయానికి తీసుకుని వెళ్లి మళ్లీ గ్రామానికి రథోత్సవాన్ని జరిపించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

కాజులూరు: కోలంకలో గురువారం బాబా యువజన సంఘం ఆధ్వర్యంలో జరుగనున్న ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని కోలంక, పరిసర గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని యువజన సంఘం ప్రోగ్రాం కో ఆర్డినేటర్ గుంటూరు మాణిక్యాలరావు అన్నారు. బుధవారం గ్రామంలో ఆయన మాట్లాడుతూ స్థానిక మండల పరిషత్ పాఠశాల ఆవరణలో ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ శిబిరం జరుగుతుందన్నారు.

వేగాయమ్మపేట గ్రామం పరిశీలన



వేగాయమ్మపేటలో రికార్డులు తనిఖీ చేస్తున్న డీపీఓ శాంతలక్ష్మి

రామచంద్రపురం రూరల్: వేగాయమ్మపేట గ్రామాన్ని జిల్లా పంచాయతీ అధికారి డి.శాంత లక్ష్మి బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ముందుగా చెత్త సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించిన ఆమె దాని నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం పంచాయతీ రికార్డులు పరిశీలించి ఆడిట్ అభ్యంతరాలు ఎక్కువగా ఉన్నాయని వాటికి వెంటనే సమాధానం రాత పూర్వకంగా అందజేసి దిద్దుబాటుకు చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శి నారాయణాచార్యులును ఆదేశించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ ఎన్. సెలత్‌రాజు, గ్రామ సర్పంచ్ అంబటి తుకారం పాల్గొన్నారు.

విద్యార్థినులకు పాఠ్య పుస్తకాల పంపిణీ



విద్యార్థినులకు పాఠ్యపుస్తకాలను అందిస్తున్న సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం, ఎస్ఎంసీ చైర్మన్

మండపేట: విద్యార్థులు బాగా చదివి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఏడిద గ్రామ సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం సూచించారు. గ్రామంలోని జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల, హైస్కూల్ ప్లస్‌లో ఇంటర్మీడియెట్ సెంకడియర్ విద్యార్థినులకు బుధవారం స్టూడెంట్ కిట్స్ పంపిణీ చేశారు. పాఠశాల హెచ్ఎం ముంగర వెంకట్రాజు అధ్యక్షతన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థినులకు పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలను అందించారు. 27 మందికి కిట్లు పంపిణీ చేసినట్టు వెంకట్రాజు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ నూతిక రాజేష్, గొడవర్తి సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రిలే దీక్షలు



రిలే దీక్షలకు సంఘీభావం తెలుపుతున్న బీజేపీ నాయకులు

మండపేట: స్థానిక సత్యశ్రీ రోడ్డులో మద్యం షాపు ఏర్పాటుకు వ్యతిరేకంగా మహిళలు చేపట్టిన రిలే దీక్షలు కొనసాగుతున్నాయి. పట్టణంలోని 28, 29, 30 వార్డుల మహిళలు, ప్రజలు బుధవారం దీక్ష చేసి నిరసన తెలిపారు. కాగా ప్రభుత్వ అధికారులు, అధికార పార్టీ నాయకులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడంతోనే ఈ దుస్థితి వచ్చిందని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు. అధికారులు, నాయకులు ఇదిగో చేస్తాం.. అదిగో చేస్తాం.. అంటున్నారే తప్ప సమస్యను ఓ కొలిక్కి తీసుకు రావడం లేదు. కాగా బుధవారం దీక్షా శిబిరాన్ని బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు అయ్యాజీ వేమ, కన్వీనర్ కోటిపల్లి సాయిరాం, కార్యదర్శి గొడవర్తి రామచంద్రరావు, ఫణి సందర్శించి సంఘీభావం తెలిపారు.

భానుడి భగభగలు



ఎండ తీవ్రత వల్ల తలకు క్యాప్, టవల్ కట్టుకుని వెళుతున్న చిరు వ్యాపారి

- పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- అల్లాడిపోతున్న ప్రజలు
- ముందస్తు జాగ్రత్తలు తప్పనిసరి అంటున్న వైద్యులు

రామచంద్రపురం రూరల్: భానుడు భగ్గుమంటున్నాడు. ఎండలు మండుతున్నాయి. పెరిగిన ఉష్ణోగ్రతలతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఉక్కపోతతో అల్లాడిపోతున్నారు. ఈ నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తలు తప్పనిసరి అని వైద్యులు సూచిస్తున్నారు. వైద్య ఆరోగ్య శాఖ ప్రజలను అప్రమత్తం చేసేందుకు అన్ని పీహెచ్‌సీలు, సబ్ సెంటర్ల పరిధిలో వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రచారం చేస్తోంది.

వడదెబ్బ లక్షణాలు

వేసవిలో ప్రజలు త్వరితగతిన వడదెబ్బకు గురవుతారు. చర్మం పొడిబారడం, చమటలు పట్టకపోవడం, తడి ఆరకపోవడం, నాడి అధికంగా కొట్టుకోవడం, స్పృహ కోల్పోవడం, శరీర ఉష్ణోగ్రత అమాంతం పెరిగిపోవడం తదితర లక్షణాలు వడదెబ్బ తగిలిన వారిలో కన్పిస్తాయి. డెంగీ, మలేరియా, టైఫాయిడ్, కామెర్లు, తదితర జబ్బులు వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రజలు తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలి.

జింక్ ఓఆర్ఎస్ కార్నర్‌ల ఏర్పాటు



గ్రామాల్లో ప్రజలకు వైద్యపరంగా అందుబాటులో ఉండే పీహెచ్‌సీలలో వేసవిలో సంభవించే వడదెబ్బ బాధితుల కోసం జింక్ ఓఆర్ఎస్ కార్నర్‌లను ఏర్పాటు చేశాం. వడదెబ్బ బాధితులకు తగిన వైద్యం అందించడంతో పాటు త్వరగా కోలుకోవడానికి ఇవి ఉపయోగపడతాయి. గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండే వైద్య సిబ్బందికి వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శిక్షణ అందించి ప్రజల్లో విరివిగా ప్రచారం కల్పించాం. అంతేకాకుండా వడదెబ్బకు గురైన వారికి అందించాల్సిన చికిత్సలపై కూడా వారికి అవగాహన కల్పించడంతో పాటు ప్రాణాపాయం లేకుండా వారిని వెంటనే సమీపంలోని వైద్యశాలకు చేర్చేలా సూచనలు ఇచ్చాం.

– డాక్టర్ ఎస్. ప్రశాంతి, డివిజనల్ మెడికల్ ఆఫీసర్, రామచంద్రపురం

వైద్యుల సూచనలు తప్పనిసరి



గతంలో కంటే ఎండ తాపం అధికంగా ఉంది. జీవన, ఆహార శైలిలో మార్పులు తప్పక చేసుకోవాలి. సురక్షిత ప్రమాణాలు పాటించాలి. వడదెబ్బ తగిలినప్పుడు దగ్గర్లోని ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి తక్షణ వైద్యం తీసుకోవాలి. సాధారణ జ్వరం వచ్చినప్పుడు అందించే మందులు వాడొద్దు. వైద్యుల సూచనలతో ఐవీ ఫ్లూయిడ్స్, వైద్య సాయం తీసుకోవాలి.

– డాక్టర్ ఎస్.ప్రవీణ్, సూపరింటెండెంట్, ఏరియా ఆసుపత్రి, రామచంద్రపురం

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

వడదెబ్బ తగిలిన వ్యక్తిని వెంటనే చల్లటి వాతావరణంలోకి తీసుకెళ్లాలి. చల్లటి తడినీటి గుడ్డతో తుడవాలి. శరీర ఉష్ణోగ్రత సాధారణ స్థితికి వచ్చే వరకు చల్లటి ప్రదేశాల్లో ఉంచాలి. వ్యక్తి పరిస్థితి తీవ్రమైతే దగ్గరలోని ఆసుపత్రికి తీసుకుని వెళ్లాలి. ఓఆర్ఎస్, గ్లూకోజ్, కొబ్బరి నీళ్లు, అందించాలి. ముందు వేసవిలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం వరకు బయట తిరగకూడదు. ఒకవేళ వెళ్లినా తలపై టోపీ లేదా గొడుగు తప్పకుండా ఉపయోగించాలి. ముఖ్యంగా వద్దులు, చిన్న పిల్లలు ఎండలో తిరగకపోవడం మంచిది. రోజూ 4 లీటర్ల నుంచి 5 లీటర్ల మంచి నీరు తప్పనిసరిగా తాగాలి.

ఉపాధి హామీ బకాయిలను వెంటనే చెల్లించాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి సత్తిబాబు



పట్టణంలో సీపీఐ ప్రచార జాతాలో ఆ పార్టీ నేతలు

రామచంద్రపురం: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పని చేసిన కూలీలకు గడచిన 8 వారాలుగా బకాయి పడ్డ రూ.750 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చెల్లించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కె.సత్తిబాబు డిమాండ్ చేశారు. సీపీఐ శతవార్షి కోత్సవాల ప్రచార జాతా ఐదో రోజున రామచంద్రాపురం నియోజకవర్గంలో సీపీఐ రామచంద్రపురం డివిజన్ నాయకులు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉండవల్లి గోపాలరావు ప్రారంభించారు. ఈ ప్రచార జాతాలో పాల్గొన్న సత్తిబాబు మాట్లాడుతూ రాష్ట్ర పంచాయతీ శాఖ మంత్రి పవన్ కల్యాణ తన పంచాయతీరాజ్ శాఖ పరిధిలో పని చేస్తున్న ఉపాధి హామీ కూలీ వేతనాల బకాయిలు వెంటనే చెల్లించాలని సత్తిబాబు డిమాండ్ చేశారు. దేశభవిష్యత్తు అనుగుణంగా మన విదేశాంగ విధానం అనుసరించి ప్రజలపై ఆర్థిక భారాలు మోపవద్దని హితవు పలికారు. ఇప్పటికే ఆయిల్, వంట గ్యాస్ రేటు పెరిగాయని పేర్కొన్నారు. సీపీఐ రామచంద్రాపురం నియోజకవర్గం కార్యదర్శ పెద్దిరెడ్డి రాము మాట్లాడుతూ సీఎం చంద్రబాబు తన ఎన్నికల ప్రచారంలో సీపీఐ ప్రతిపాదననే అజెండాగా మార్చుకుని ప్రజలకు హామీ ఇచ్చారన్నారు. ఆ మేరకు పేద మధ్య తరగతి ప్రజలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరారు. ఇందులో భాగంగా ఈనెల 12న పట్టణంలోని చెలికాని రామారావు స్మారక భవనంలో సీపీఐ పార్టీ కార్యకర్తలు ఇంటి స్థలం మంజూరీ కోరుతూ దరఖాస్తు నమోదు చేసేందుకు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో భారతీయ కేతు మద్దూరు యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ ప్రజానాట్య మండలి రామచంద్రపురం శాఖ కార్యదర్శి మందపల్లి ప్రేమానందం, వి.రాంబాబు, వి.కృష్ణ మూర్తి, మహమ్మద్ బాబ్జి, పి.గురుమూర్తి డి.రవి, వి.తిరు మలరావు, బి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లు వద్దు, పాత మీటర్లే ముద్దు

కోలంక గ్రామస్తుల ఆందోళనలు



కోలంకలో కరపత్రాలతో నినాదాలు చేస్తున్న స్థానికులు

కాజులూరు: గ్రామాలలో చిరు వ్యాపార సంస్థలు, గృహ సముదాయాలకు విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ప్రతిఘటిస్తూ కోలంకలో బుధవారం గ్రామస్తులు ఆందోళనలు వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లు రాజబాబు ఆధ్వర్యంలో పలువురు స్థానికులు కరపత్రాలతో నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రాజబాబు మాట్లాడుతూ విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటుతో చిరు వ్యాపారులు, పేద, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతారన్నారు. సార్వత్రిక ఎన్నికల ముందు స్మార్ట్ మీటర్లు వేస్తుంటే ప్రజలు సిబ్బందిపై తిరగబడి అడ్డుకోవాలని తాము అధికారంలోనికి వస్తే వెంటనే వాటిని రద్దు చేస్తామని ప్రకటించిన టీడీపీ నేతలు చంద్రబాబు, లోకేష్‌లు ఇప్పుడు ఆదాని కంపెనీతో ఒప్పందం కుదుర్చుకుని వాటిని కొనసాగించడం దారుణమన్నారు. ఇప్పుడు మీటర్లు ఉచితమని చెప్పి ప్రజలను మభ్యపెట్టి స్మార్ట్ మీటర్లు వేసేందుకు చూస్తున్నారని భవిష్యత్తులో వాటి ఖరీదును కరెంటు బిల్లుతో కలిపి వసూలు చేస్తారన్నారు. ఇప్పటికే పెరిగిన విద్యుత్ బిల్లుల చార్జీలతో సతమతమవుతున్న ప్రజలను ఇలా స్మార్ట్ మీటర్ల పేరుతో ఇబ్బందుల పాలు చేయడం సరికాదన్నారు. స్మార్ట్‌మీటర్లను ప్రభుత్వం రద్దు చేయ్యాలన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు బొండా దొరబాబు, వెంకన్నబాబు, పెదిరెడ్డి వెంకటేశ్వర్లు, బూరెల సూరిబాబు, బూరెల పల్లపురాజు, నందికోళ్ళ సత్తిబాబు, పెదిరెడ్డి రాజు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో అడ్మిషన్ల డ్రైవ్



ఏడిద కాలనీలో విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

మండపేట: మా పాఠశాలలో విద్యార్థులను చేర్పించి మీ పిల్లల భవిష్యత్తుకు బంగారుబాట వేయండి అంటూ ఏడిద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. మండలంలోని ఏడిదతో పాటు సీతానగరం, సావరం, కొత్తూరు గ్రామాలను సందర్శించి ప్రతి ఇంటికి వెళ్తున్నారు. ప్రధానోపాధ్యాయుడు ముంగర వెంకట్రాజు నేతృత్వంలో ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలల్లో అందించే మెరుగైన విద్యా బోధనతో పాటు మౌలిక వసతులను విద్యార్థుల తల్లిదండ్రులకు తెలియజేస్తున్నారు. పాఠశాల ముగిసిన తరువాత సాయంత్రం 6 నుంచి 9 గంటల వరకూ ఇంటింటా ప్రచారం చేసి విద్యార్థులను, వారి తల్లిదండ్రులను చైతన్య పరుస్తున్నారు. బుధవారం గ్రామంలో పర్యటించి పాఠశాల ప్రాముఖ్యతను వివరించారు. ప్రతి విద్యార్థి పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని చెప్పడంతో పాఠశాలలో చేందుకు ఎక్కువ మంది మొగ్గుచూపుతున్నారని వెంకట్రాజు తెలిపారు. 6 నుంచి 12 తరగతి వరకూ 30 మంది విద్యార్థులు చేరేందుకు ఆసక్తి కనబరిచారని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ నూతన రాజేష్, చిక్కాల నవీన్‌కుమార్, తోరాటి సాయి, బీ రామయ్య చౌదరి, సిద్ధాంతపు వీర్రాజు, వేదుల శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



కపిలేశ్వరపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో 50 ఏళ్ల తరువాత కలసిన విద్యార్థులు

కపిలేశ్వరపురం: వారంతా సుమారు 50 ఏళ్ల క్రితం స్థానిక శ్రీసర్వారాయ జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివారు. కాల గమనంలో వారి ఉన్నత చదువులు, వృత్తి, వ్యాపారాలు, వ్యాపకాలతో విభిన్న ప్రదేశాల్లో స్థిరపడ్డారు. 1975–76 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన ఆ పూర్వ విద్యార్థులు బుధవారం తాము చదువుకున్న పాఠశాలలోనే ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకొని తమ కుటుంబ సభ్యులను పరిచయం చేసుకున్నారు. అలనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుని మురిసిపోయారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సత్కరించారు. వారికి జ్ఞాపికలు అందజేసి ఆశీస్సులు తీసుకొన్నారు. కపిలేశ్వరపురం గ్రామానికి చెందిన వేదపండితుడు పెద్దింటి వెంకట లక్ష్మీ నరసింహాచార్యులును సత్కరించారు. పాఠశాలలో సదుపాయాల కల్పనకు పాటుపడతామని హామీ ఇచ్చారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఆటపాటలతో సందడిగా గడిపారు. వయస్సులో పెద్దవారిగా కనిపించే పూర్వ విద్యార్థులంతా పాఠశాల ఆవరణలో చిన్నపిల్లలుగా సందడి చేయడం విశేషంగా ఆకట్టుకుంది.

కష్టకాలంలో కల్పతరువు

- సూక్ష్మ పరిశీలన వైద్యం హోమియో
- ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 51 కేంద్రాలు
- పలు కేంద్రాల్లో సిబ్బంది కొరత
- తక్కువ ఖర్చుతో ఎక్కువ మందికి మేలు
- నేడు ప్రపంచ హోమియో డే



మండపేటలో రోగులను పరీక్షిస్తున్న హోమియో వైద్యులు రవికుమార్



దుకాణంలో అతి తక్కువ ఖర్చుకు లభించే హోమియో మందులు

కపిలేశ్వరపురం: జీవితంలో మానసిక, శారీరక రుగ్మతలు తలెత్తినప్పుడు సామాన్య ప్రజలు వైద్యులను సంప్రదిస్తారు. ఆధునిక కాలంలో అల్లోపతి వైద్యం విస్తృతమైనప్పటికీ సుదీర్ఘకాలం పాటు ఆయుర్వేదం, యోగా, సిద్ధా, హోమియో (ఆయుష్) వైద్య పద్ధతులు విరివిగా జనబాహుళ్యానికి విశేష సేవలందించాయి. ఎలాంటి అధునాతన వైద్య పరికరాలు, ప్రచార సాధనాలు లేని రోజుల్లో శాస్త్రీయమైన పద్ధతిలో మానవాళికి వైద్య సేవలందించాయి. నేటికీ వాటి ప్రాధాన్యత కొనసాగుతూనే ఉంది. కేంద్ర ప్రభుత్వం వాటిని రూ.కోట్లు ఖర్చుపెట్టి నిర్వహిస్తోంది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో కూటమి ప్రభుత్వం హోమియో కేంద్రాలను నిర్లక్ష్యం చేస్తోంది. కొన్ని చోట్ల వైద్యులు లేక కేంద్రాలు మూతపడగా, మరికొన్ని చోట్ల వైద్యులు మాత్రమే ఉండి ఇతర సిబ్బంది లేని పరిస్థితులు నెలకొన్నాయి. నేడు ప్రపంచ హోమియో డే సందర్భంగా ఈ కథనం..

తక్కువ ఖర్చుతో..

కేంద్రం 60 శాతం, రాష్ట్రం 40 శాతం నిధులతో ఆయుష్ కేంద్రాలను నిర్వహిస్తున్నాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అనేక మంది హోమియో వైద్యులు సామాజిక బాధ్యతగా కేంద్రాలను నిర్వహిస్తూ తక్కువ ఖర్చుతో చికిత్సనందిస్తున్నారు. కాగా కూటమి ప్రభుత్వంలో కేంద్రాల నిర్వహణ సక్రమంగా సాగడం లేదు. హోమియో కేంద్రాల్లో వైద్యులకు డ్రాయింగ్ పవర్ లేక పోవడంతో జీతభత్యాలు పొందేందుకు, ఇతర ఆర్థికపరమైన అంశాలు కోసం ఏలూరులోని రీజినల్ డైరెక్టర్ కార్యాలయాన్ని సంప్రదించాల్సి వస్తోంది. సిబ్బంది లేకపోవడంతో కార్యాలయాన్ని సంప్రదించడం ఓ ప్రహసనంగా ఉంది.

ఉమ్మడి జిల్లాలో హోమియో కేంద్రాలిలా...

ఆయుర్వేద, యోగా, యునాని, సిద్ధా, హోమియో అనే ఐదు సంప్రదాయ వైద్య పద్ధతులను ఆయుష్ పేరుతో నిర్వహిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో 51 కేంద్రాలున్నాయి. వాటిలో 25 ఆయుర్వేద, రెండు యునాని కేంద్రాలున్నాయి. 24 హోమియో కేంద్రాలుండగా వాటిలో జొన్నాడ, ద్రాక్షపాడు కేంద్రాలు వైద్యులతో సహా సిబ్బంది లేకపోవడంతో మూతపడ్డాయి. 21 కేంద్రాలు వైద్యుడుతో మాత్రమే నడుస్తున్నాయి. కాంపౌండర్, స్కావెంజర్ కం స్వీపర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మండపేట నియోజకవర్గంలో తాపేశ్వరం, వెంటూరులో వైద్యుడు మాత్రమే ఉన్నారు. కోటిపల్లి కేంద్రంలో వైద్యులు, ఎంఎన్ఓ మాత్రమే ఉన్నారు.

హోమియో వైద్యం ప్రత్యేకతలు

హోమియో వైద్య విధానాన్ని అధ్యయనం చేసిన ప్రైవేటు వైద్యులు సైతం సామాజిక దృక్పథంతో సామాన్యులకు వైద్యమందిస్తున్నారు. అవిభక్త జిల్లాలో కాకినాడ, రాజమహేంద్రవరం, అమలాపురం, మండపేట, రావులపాలెం, జొన్నాడ తదితర ప్రాంతాల్లో అనేక మంది వైద్యులు తక్కువ ఫీజుతో వైద్యం చేస్తున్నారు. హోమియోలో రోగి మానసిక, శారీరక స్థితిగతులు, అతని సహజ లక్షణాలను అధ్యయనం చేసేందుకు రోగితో ఎక్కువ సమయం మట్లాడతారు. దీంతో రోగికి తన బాధలను పూర్తిగా చెప్పుకునే వీలు కలుగుతుంది. రోగి శారీరక, మానసిక, కుటుంబ నేపథ్యానికి సంబంధించిన అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుని మందులివ్వడం హోమియో విధానం. ఈ విధానంలో కీళ్లు, చర్మం, జీర్ణ కోశం, అలెర్జీ తదతర వ్యాధులను తక్కువ ఖర్చుతో తగ్గించేందుకు సమర్థవంతమైన మందులున్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) లెక్కల ప్రకారం 80 దేశాల్లో 60 కోట్ల మంది ప్రజలు హోమియో వైద్యాన్ని ఆశ్రయిస్తున్నారని తేలింది. ప్రపంచంలో రెండో అతిపెద్ద వైద్య విధానంగా హోమియో పేరుగాంచింది.

ప్రజలు ఆసక్తి చూపుతున్నారు



హోమియో వైద్యం పట్ల ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. ఆధునిక సాంకేతిక పద్ధతులు ఉనికిలోకి రావడంతో హోమియో వైద్యంపై అధ్యయనం పెరిగింది. అతి తక్కువ ఖర్చుతో చికిత్సను పొందుతుండటంతో మంచి స్పందన ఉంది. వ్యాధి మూలాలను తొలగిస్తూ సమూలంగా నయం చేయడం హోమియో వైద్యం ప్రత్యేకత. ఈ పద్ధతిలో రోగి బాధలతో పాటు ఇతర రుగ్మతలు కూడా నయం అవుతాయి.

డాక్టర్ చల్లా రవికుమార్, గౌతమి హోమియో క్లినిక్ వైద్యులు, మండపేట

డ్రైన్‌కు శంకుస్థాపన



డ్రైన్‌కు శంకుస్థాపన చేస్తున్న ఎంపీ బోస్ తదితరులు

రామచంద్రపురం: పట్టణంలోని 9వ వార్డు శాంతినగర్‌లో ఎంపీ నిధులు రూ.25లక్షలతో నిర్మించే డ్రైనేజీ నిర్మాణానికి రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్ బుధవారం శంకుస్థాపన చేసి భూమి పూజ చేశారు. కార్మికశాఖ మంత్రి సుభాష్ తండ్రి, టీడీపీ నాయకులు వాసంశెట్టి సత్యం, మున్సిపల్ చైర్ పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, మున్సిపల్ వైస్ చైర్మన్ చింతపల్లి నాగేశ్వరరావు, స్థానిక కౌన్సిలర్ కోటి శ్రీకన్య, కౌన్సిలర్‌లు కేతా శ్రీను, మున్సిపల్ కమిషనర్ అయ్యప్పనాయుడు వార్డు పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

క్రిస్టియన్ విభాగం అధ్యక్షుడిగా రాంబాబు



ఎమ్మెల్సీ తోటను సత్కరిస్తున్న రాంబాబు

మండపేట: వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ విభాగం నియోజకవర్గ అధ్యక్షుడిగా ఏడిద సీతానగరం గ్రామానికి చెందిన పార్టీ నేత చిక్కాల రాంబాబును నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన బుధవారం విజయలక్ష్మి నగర్‌లో ఉన్న పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులును మర్యాదపూర్వకంగా కలిశారు. తోటను శాలువా, పూలమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా తోట త్రిమూర్తులు మాట్లాడుతూ నియోజకవర్గంలోని మూడు మండలాల్లో క్రిస్టియన్ కమిటీలు ఏర్పాటు చేయాలని సూచించారు. క్రిస్టియన్ల సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన ఎమ్మెల్సీ తోటకు రాంబాబు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాధాకృష్ణ, కౌన్సిలర్ మెండు బాపిరాజు, దారా సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నరసన్న సన్నిధిలో అమలాపురం ఆర్డీఓ

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహా స్వామివారి ఆలయంలో బుధవారం అమలాపురం ఆర్డీఓ కొత్త మాధవి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద ఆర్డీఓకు ఆలయ మర్యాదలతో ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్, వేదపండితుడు చింతా వేంకట శాస్త్రి స్వాగతం పలికారు. పూజలు అనంతరం ఆర్డీఓకు అర్చకులు ఆశీర్వచనాలు పలికారు. ఆర్డీఓకు స్వామి చిత్రపటం, లడ్డూ ప్రసాదాన్ని అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ అందజేశారు. కాగా దేవస్థానానికి సంబంధించిన భూములు గురించి, రైతుల నుంచి రావాల్సిన బకాయిలు గురించి ఆర్డీఓ, ఏసీ సత్యనారాయణతో సమీక్షించారు. బకాయిలు వసూలుకు తీసుకోవాల్సిన చర్యలను ఆర్డీఓ, ఆయనతో చర్చించారు. ఇదిలా ఉండగా మండల పరిధిలోని శంకర్ థియేటర్‌ను ఆర్డీఓ మాధవి ఆకస్మిక తనిఖీ చేశారు. అక్కడ స్టాల్స్‌లో విక్రయిస్తున్న తినుబండారాలను ఆమె పరిశీలించారు. వాటి నాణ్యతలపై ఆమె ఆరా తీశారు. ఆమె వెంట తహసీల్దారు ఎం.వెంకటేశ్వరరావు, డిప్యూటీ తహసీల్దారు సీహెచ్.భాస్కర్, ఆర్ఐ వి.రామరాజు ఉన్నారు.

జగన్మోహినీ కేశవస్వామికి ప్రత్యేక పూజలు

కొత్తపేట: మండల పరిధిలోని పురాణ ప్రసిద్ధి చెందిన ర్యాలి జగన్మోహిని కేశవస్వామి వారి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు బుధవారం విశేష పూజలు, అర్చనలు, వివిధ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. దేవస్థానం ఈఓ భాగవతులు వెంకట రమణమూర్తి ఆధ్వర్యంలో ఉదయం నుంచి స్వామి వారికి అభిషేకం, అర్చన, తులసిపూజ, అమ్మవార్లకు కుంకుమార్చన నిర్వహించారు. రాత్రి కరప విఘ్నేశ్వర కళాకారుల బృందం వారిచే మైరావణ చరిత్ర తోలు బొమ్మలాట ప్రదర్శించారు.